

ప్రతిపాదనలకే పరిమితమా?

ఆమనగల్లులో అతిథిగృహం లేక ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. 8లో▸



గందరగోళం

ఘట్‌కేసర్ సమీపంలోని పగిడిపల్లి వద్ద ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది. 8లో▸



దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..

దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. 8లో▸

న్యూస్‌రీల్

10న జాబ్‌మేళా

ఇబ్రహీంపట్నం: ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు నిరుద్యోగ యువతీయువకులకు ఈనెల 10న ఆన్‌లైన్ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కార్యాలయ అధికారి జయశ్రీ తెలిపారు. అపోలో ఫార్మాసీతోపాటు పలు ప్రైవేట్ సంస్థలు ఈ జాబ్‌మేళాలో పాల్గొంటాయన్నారు. అపోలో ఫార్మాసీలో 120 పోస్టులు ఉన్నట్లు చెప్పారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ, ఎం ఫార్మసీ చదివిన నిరుద్యోగులు అర్హులని పేర్కొన్నారు. జూమ్ మీటింగ్ ఐడీ: 77157727302: 02:00 పీఎం, పాస్ కోడ్: 123456లో జాయిన్ అవ్వాలని సూచించారు. మిగతా వివరాలకు 82476 56356 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

'పట్నం' మున్సిపల్ కమిషనర్‌పై ఫిర్యాదు



అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు ఫిర్యాదు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

ఇబ్రహీంపట్నం: మున్సిపల్ కమిషనర్ యూసుఫ్‌ను వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు శుక్రవారం కౌన్సిల్ సభ్యులు ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి తోపాటు అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు మూకుమ్మడిగా కలెక్టర్ కార్యాలయానికి తరలివెళ్లి కమిషనర్ యూసుఫ్ చేస్తున్న అవినీతి, అక్రమాలు, కౌన్సిలర్లపై అతని వ్యవహారశైలిని వివరించారు.

ముగిసిన హజ్ ఆరాధనలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం నుంచి వెళ్లిన హజ్ యాత్రికుల ఆరాధనలు ముగియడంతో భక్తులు మదీనా నగరానికి వెళ్తున్నారని హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ సలీం తెలిపారు. శుక్రవారం నాంపల్లిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం నుంచి వెళ్లిన 5,583మంది యాత్రికులు క్షేమంగా ఉన్నా రని, అనారోగ్య కారణాలతో ఇద్దరు యాత్రికులు మృతి చెందినట్లు ఆయన తెలిపారు. వీరిలో ఒకరు బార్కస్‌కు చెంది అహ్మద్ బిన్ అబ్దుల్లా (76), మరొకరు నిజామాబాద్ అహ్మద్‌పురా కాలనీకి చెందిన సయ్యద్ అబ్దుల్ ఖుద్దుస్ (73) ఉన్నట్లు చెప్పారు. హజ్ ఆరాధనలు పూర్తయ్యాక మూడు గ్రూప్‌లుగా మదీనా నగరానికి చేరుకుంటారన్నారు. మదీనా నగరంలో వారం రోజులు ఉండి ఈ నెల 15న నుంచి నగరానికి తిరుగు పయనమవుతారని సలీం తెలిపారు. 30 దీ వరకు యాత్రికులంతా ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారని వివరించారు.

సమన్వయంతోనే డగ్స్‌కు అడ్డుకట్ట: సీపీ

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో మాదకద్రవ్యాలకు చెక్ చెప్పడానికి ప్రత్యేకంగా ఏర్పాటైన నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎన్-కాడ్) తొలి సమావేశం గురువారం జరిగిందని శుక్రవారం కొత్వాల్ సీపీ ఆనంద్ పేర్కొన్నారు. సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అన్ని ఏజెన్సీలు పాల్గొన్నట్లు ఆయన వివరించారు. పోలీసు విభాగంతో పాటు పాఠశాల విద్య, వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఎఫ్ఆర్ఆర్‌ఓ, ఐబీ తదితర సంస్థలు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయంతో పని చేస్తేనే డ్రగ్స్‌ను నిరోధించగలమని, దీనికోసం ఏఏ విభాగాలు ఏ పాత్ర పోషించాలనేది ఈ సమావేశంలో చర్చించామని ఆనంద్ పేర్కొన్నారు. ఇకపై ప్రతినెలా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

ఫీజుల బకాయి రూ.5 వేల కోట్లు విడుదల చేయాలి

ఆర్.కృష్ణయ్య

విజయనగర్‌కాలనీ:కళాశాల విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.5 వేల కోట్లు వెంటనే విడుదల చేయడంతో పాటు రూ.20 వేల స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. సంఘం కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులతో కలిసి శుక్రవారం ఆయన మాసబ్‌ట్యాంక్‌లోని బీసీ సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్ కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీంను పునరుద్ధరించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ తదితర కోర్సులకు పూర్తి ఫీజులు చెల్లించాలన్నారు. కళాశాల విద్యార్థులకు సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌లో ఇస్తున్నట్లు రూ.20 వేల స్కాలర్‌షిప్‌లను మన రాష్ట్రంలోనూ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, ఎర్ర సత్యనారాయణ, అంజి, రామకృష్ణ, నీల వెంకటేష్, సతీష్, నీరడి భూపేష్ సాగర్, రాజ్‌కుమార్, నందగోపాల్, భాస్కర్, ఉదయ్ పాల్గొన్నారు.

'పట్నం'పై గురి



దృష్టి సారించిన సీపీఎం

- పొత్తులో భాగంగా దీన్ని కోరే చాన్స్
- ఇప్పటికీ క్షేత్రస్థాయిలో కేడర్ పోరాటాలు
- జనం మధ్యే ఉంటూ పోటీకి సిద్ధమవుతున్న నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంపై సీపీఎం గురిపెట్టింది. సాధారణ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్ లేదా కాంగ్రెస్ పార్టీలతో కుదిరే పొత్తులో భాగంగా జిల్లాలో ఆ పార్టీకి అంతో ఇంతో పట్టున్న ఈ స్థానాన్ని తమకు కేటాయించాల్సిందిగా పట్టుపట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు పార్టీని అంటిపెట్టుకున్న మెజార్టీ కార్యకర్తలు ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత చోటు చేసుకున్న రాజకీయ, ఆర్థిక పరిణామాలతో ఇతర పార్టీల్లో చేరిపోయారు. మిగిలిన వారు ప్రజల్లో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నంలో భాగంగా పేదలకు రెండు పడక గదుల ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీ, ఫార్మాసిటీ భూ సేకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తూ వస్తున్నారు.

మూడుసార్లు అసెంబ్లీకి ప్రాతినిధ్యం

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సీపీఎంకు మొదటి నుంచి గట్టి పట్టుంది. ఈ నియోజకవర్గం కేంద్రంగా గతంలో పెద్ద ఎత్తున భూ పోరాటాలు నిర్వహించింది. ఫలితంగా ప్రజల్లో ఆ పార్టీకి మంచి ఆదరణ లభించింది. 1989 ఎన్నికల్లో కొండిగారి రాములు ఇక్కడి నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. 1994 ఎన్నికల్లో రెండో సారి కూడా ఆయనే గెలుపొందారు. 2004 మస్కు నరసింహ విజయం సాధించారు. సీపీఎం అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించి ఈ మూడు సందర్భాల్లోనూ పేదలకు ప్రభుత్వ, మిగులు, భూదాన్ భూములను పెద్ద ఎత్తున పంచిపెట్టారు. సంస్థాగతంగా పార్టీ బలపడేందుకు ఇవే దోహదం చేశాయి. ప్రస్తుతం స్థానికంగా ఓటు బ్యాంకు తగ్గినా.. ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే ఇక్కడే కొంత బలంగా ఉంది. బరిలోకి దిగితే వీరికి సీపీఐ మద్దతు ప్రకటించే అవకాశం లేకపోలేదు.

ఓట్లు పోలయ్యాయి ఇలా..

- 1989లో 1,37,683 ఓట్లకు 1,02,960 ఓట్లు పోలయ్యాయి. 98,203 ఓట్లు మాత్రమే చెల్లుబాటయ్యాయి. వీటిలో సీపీఎం అభ్యర్థి కొండిగారి రాములుకు 49,477 ఓట్లు రాగా.. ప్రత్యర్థి పార్టీ అయిన కాంగ్రెస్ అభ్యర్థి ఏజీ కృష్ణకు 45,309 ఓట్లు పోలయ్యాయి.
- 1994 జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కె.సత్యనారాయణపై కొండిగారి రాములు రెండోసారి విజయం సాధించారు. 1,48,204 ఓట్లకు 1,13,688 ఓట్లు పోలయ్యాయి. వీటిలో 1,10,790 ఓట్లు చెల్లుబాటయ్యాయి. సీపీఎం అభ్యర్థి రాములుకు 61,258 ఓట్లు రాగా, ప్రత్యర్థి సత్యనారాయణకు 31,358 ఓట్లు మాత్రమే వచ్చాయి.
- 2004లో జరిగిన ఎన్నికల్లో మస్కు నర్సింహ ఇదే పార్టీ నుంచి గెలుపొందారు. 1,76,388 ఓట్లకు 1,34,999 పోలవగా, సీపీఎం అభ్యర్థి ఎం.నర్సింహకు 67,288 ఓట్లు రాగా, ప్రత్యర్థి పార్టీ అయిన టీడీపీ అభ్యర్థి ఎస్.రవికుమార్‌కు 54,481 ఓట్లు మాత్రమే లభించాయి.
- అప్పటి వరకు రిజర్వుడ్ కేటగిరీలో ఉన్న ఈ నియోజకవర్గం 2009లో జనరల్‌గా మారింది. అప్పటి పొత్తుల్లో భాగంగా పోటీకి దూరంగా ఉంది.
- 2014 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున పోటీ చేసిన పగడాల యాదయ్యకు 14,902 ఓట్లు పోలయ్యాయి.
- 2018 ఎన్నికల్లోనూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేశారు.

ఆశావహులు అనేకం

పొత్తులో భాగంగా ఈ సీటు సీపీఎంకు దక్కితే పోటీ చేసేందుకు ఆశావహులు కూడా చాలామందే ఉన్నారు. ఇప్పటికే గత రెండు ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన పగడాల యాదయ్య మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు యాచారానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, కూలీ పోరాటాలకు నాయకత్వం వహించిన బోడ సాయిలు, పార్టీ జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, విద్యార్థి ఉద్యమం నుంచి పార్టీలోకి వచ్చిన డి.జగదీశ్ సైతం బరిలోకి దిగేందుకు సై అంటున్నారు. మెజార్టీ పార్టీ వర్గాలు పగడాల యాదయ్య వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ఆయనకు ఆర్థికంగానే కాకుండా సామాజికంగానూ కొంత పట్టున్నట్లు సమాచారం. ప్రజా ఉద్యమాలను వేదికగా చేసుకుని నిత్యం ప్రజల మధ్య ఉండేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏం జరుగుతుందనేది వేచి చూడాలి.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హరీశ్ తదితరులు

'క్రమబద్ధీకరణ'కు అన్ని చర్యలు

- కలెక్టర్ హరీశ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఆక్రమిత ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 58 కింద జిల్లా వ్యాప్తంగా 19,661 దరఖాస్తులు అందాయని, వీటిలో 4,552 డిస్పోజ్ చేయడం జరిగిందని తెలిపారు. 59 కింద 13,231 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. 118 కింద 5,802 దరఖాస్తులు రాగా, వీటిలో 4,947 దరఖాస్తులను డిస్పోజ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వెంటనే పరిష్కరిస్తామని, ధరణి పెండింగ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతీక్ జైన్, తిరుపతి రావు, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఆర్డీఓలు వెంకటాచారి, సూరజ్, వేణుగోపాల్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరీశ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 58, 59, 118 కింద వచ్చిన దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి, లబ్ధిదారులకు పట్టాలు అందజేయాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కోరగా దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలను చేపడతామని, ఎవరికి అన్యాయం జరగకుండా పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ తిరుపతి రావు, ఆర్డీఓలు వెంకటాచారి, సూరజ్, తహసీల్దారులు జయశ్రీ, సంధ్య, ఏడీ సర్వే ల్యాండ్ శ్రీనివాస్, పరిశ్రమల జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాహుల్‌పై కక్షసాధింపు

- కేంద్రంపై డీసీసీ అధ్యక్షుడు చల్లా ధ్వజం



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మీర్‌పేట: రాహుల్‌గాంధీపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. గుజరాత్ హైకోర్టు ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ అనర్హతపై వేసిన స్టే పిటిషన్ స్వీకరించకుండా తిరస్కరించడాన్ని నిరసిస్తూ శుక్రవారం మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలో పార్టీ నాయకులతో కలిసి ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ, రాహుల్‌గాంధీకి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేకే బీజేపీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత, నాయకులు ఏనుగు జంగారెడ్డి, కొత్త మనోహర్‌రెడ్డి, రాజ్‌కుమార్, చల్లా బాల్‌రెడ్డి, శంకర్ యాదవ్, కీసర యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి, అహ్మద్‌ఖాన్, ఐతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కోకాపేట్.. హాట్ కేక్!

- నియో పోలిస్‌లో అపరిమిత అంతస్తులు
- రెండో దశ అమ్మకాలకు హెచ్‌ఎండీఏ నోటిఫికేషన్
- మొత్తం 7 ప్లాట్లలో విక్రయానికి 45.33 ఎకరాలు
- వచ్చే నెల 3న రెండు విడతలుగా భూముల వేలం
- ఎకరా కనీస ధర రూ.35 కోట్లుగా నిర్ణయం
- ఆన్‌లైన్ బిడ్డింగ్‌తో ప్రభుత్వానికి రూ.కోట్లలో ఆదాయం

సాక్షి, సిటీబ్యూరో: కోకాపేట్ ఇప్పుడు ఒక హాట్‌కేక్. అక్కడ భూమి బంగారం కంటే ఎంతో విలువైంది. మహా నగరానికి పడమటి వైపున ఆకాశ హర్మ్యాలతో అలరారే కోకాపేట్ అంతర్జాతీయ హంగులతో దేశవిదేశాలకు చెందిన వ్యాపార దిగ్గజ సంస్థలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఒకవైపు ఔటర్‌రింగ్ రోడ్డు, మరోవైపు రాయదుర్గం నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి నిర్మించతలపెట్టిన ఎయిర్‌పోర్టు మెట్రోకు అందుబాటులో ఉన్న కోకాపేట్‌లో హెచ్‌ఎండీఏ ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేసిన నియోపోలిస్ లేఅవుట్‌లో రెండో దశ ప్లాట్ల అమ్మకాలకు సన్నాహాలు చేపట్టింది.

విశాలమైన రహదారులు.. అత్యాధునిక సదుపాయాలు

- సుమారు వంద ఎకరాలకుపైగా విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన ఈ లేఅవుట్‌లో మొదటి దశలో ఎకరం రూ.40 కోట్ల నుంచి రూ.50 కోట్ల చొప్పున 64 ఎకరాలను విక్రయించారు. తాజాగా మరో 7 ప్లాట్లలో విస్తరించిన ఉన్న 45.33 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టారు. ఈసారి ఎకరా కనీస ధర రూ.35 కోట్లుగా నిర్ణయించినప్పటికీ ఆన్‌లైన్ వేలం ద్వారా రూ.50 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు కూడా అమ్ముడయ్యే అవకాశం ఉన్నట్లు అంచనా. విశాలమైన రహదారులతో, అత్యాధునిక సదుపాయాలతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేశారు.
- హైటెక్‌సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, నాలెడ్జ్ సొసైటీకి చేరువలో ఉన్న నియోపోలిస్ లేఅవుట్ చుట్టూ 5 కిలోమీటర్ల పరిధిలోనే అమేజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఉండడంతో ఈ భూమికి భారీ డిమాండ్ నెలకొంది. పైగా బహుళ వినియోగ అనుమతులు ఉండడంతో అంతర్జాతీయ వ్యాపార దిగ్గజ సంస్థలు, బడా రియల్టర్లు, డెవలపర్లు నియోపోలిస్ కోసం పెద్ద ఎత్తున పోటీ పడనున్నారు.
- మొదటి దశలో ఒకటి నుంచి 5 ప్లాట్ల వరకు విక్రయించగా ప్రస్తుతం 6 నుంచి 14 వరకు ఉన్న ప్లాట్లలో భూమిని అమ్మకానికి పెట్టారు. ప్లాట్ల సైజు మేరకు కనిష్టంగా 3.60 ఎకరాల నుంచి గరిష్టంగా 9.71 ఎకరాల భూమి ఉంది. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ నెల 31వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆగస్టు ఒకటో తేదీ వరకు డిపాజిట్ చెల్లించేందుకు గడువు విధించారు. ఆగస్టు 3న ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా ఆన్‌లైన్ బిడ్డింగ్ నిర్వహించనున్నారు.

ప్రత్యేకతలెన్నో..

- సముద్ర మట్టానికి 588 మీటర్ల ఎత్తులో ఉన్న నియోపోలిస్ ప్రాజెక్టు అభివృద్ధి కోసం హెచ్‌ఎండీఏ రూ.300 కోట్లు ఖర్చు చేసింది. సుమారు 40 ఎకరాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించారు.
- సైకిల్ ట్రాక్‌లు, ఫుట్‌పాత్‌లు తదితర సదుపాయాలతో 45 మీటర్ల, 36 మీటర్ల వెడల్పుతో అంతర్గత రోడ్లను అభివృద్ధి చేశారు. భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ తదితర అన్ని సదుపాయాలు ఉన్నాయి. కమర్షియల్, రెసిడెన్షియల్, ఎంటర్‌టైన్‌మెంట్ తదితర అన్ని రకాల భవనాలకు అనుమతులు ఇచ్చారు.
- నియోపోలిస్‌లో ఎన్ని అంతస్తుల వరకైనా హైరైజ్ బిల్డింగ్‌లను నిర్మించొచ్చు.
- ఔటర్ రింగ్‌రోడ్డుకు కేవలం 2 నిమిషాల్లో చేరుకోవచ్చు. అలాగే ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌కు 5 నిమిషాలు, ఎయిర్‌పోర్టుకు 20 నిమిషాలు, హైటెక్ సిటీకి 20 నిమిషాల వ్యవధిలో చేరుకొనే విధంగా రోడ్డు నెట్‌వర్క్ అందుబాటులో ఉంది.

ఈ నెల 20న ప్రీబిడ్ మీటింగ్..

నియోపోలిస్ రెండో దశ భూముల వేలంపై ఈ నెల 20న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. ఆసక్తిగల కొనుగోలుదారులు ఈ సమావేశంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. భూముల అమ్మకాలు, రిజిస్ట్రేషన్లు తదితర కార్యక్రమాల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సింగిల్‌విండో పద్ధతిలో పూర్తి చేయనున్నారు.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

- పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు
- ఈనెల 23 వరకు ముగించాలని ఆదేశాలు
- మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి



కేశంపేట మండలం కొత్తపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

షాద్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో నిర్వహణపై ఎన్నికల సంఘం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందుకు కావాల్సిన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఓటర్ల జాబితా నవీకరణపై దృష్టి సారించారు. అక్టోబర్ 4న తుది ఓటర్ల జాబితా ప్రకటించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు.

సెంటర్ల పరిశీలన

గ్రామాలు, పట్టణాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలనను వెంటనే పూర్తి చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాల పరిశీలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఈనెల 23 వరకు పూర్తి చేసి ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు. పట్టణంతో పాటు, గ్రామాల్లో ప్రతి కేంద్రాన్ని బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, తహసీల్దార్లు, ఎంఈఓలు పరిశీలిస్తున్నారు.

సదుపాయాల కల్పనకు చర్యలు

పోలింగ్ కేంద్రాల పరిశీలనలో భాగంగా ప్రతి కేంద్రంలో విద్యుత్ సౌకర్యం, గదుల్లో వెలుతురు సరిగా ఉందా, లేదా, తాగునీటి సదుపాయం, మూత్రశాలలు, ఉన్నాయా లేవా అన్న విషయాలను పరిశీలిస్తున్నారు. ఒకవేళ కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకుంటే వాటిని కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు. దివ్యాంగులకు ఇబ్బంది తలెత్తకుండా కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయనున్నారు.

కొత్త వారికి అవకాశం

కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీంతో చాలా మంది కొత్త వారు ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. ఓటర్లకు దూరంగా పోలింగ్ కేంద్రం ఉంటే సమీపంలో ఏర్పాటు చేసుకునే వెలుసుబాటు కల్పించారు.

పరిశీలన కొనసాగుతోంది



ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. పోలింగ్ కేంద్రాలో మౌలిక సదుపాయాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

– వెంకటమాధవ రావు, ఆర్డీఓ, షాద్‌నగర్

బస్తీల్లో సమస్యలు లేకుండా చూస్తాం

- మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీని కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 17,18,19,20,21,22,23 వార్డుల పరిధిలో రూ.5.60 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదల గుండెల్లో గూడు కట్టుకుంటున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించిన రూ.25కోట్లతో బస్తీల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయన్నారు. అన్ని బస్తీల్లో సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, కౌన్సిలర్లు ఎనగండ్ల ప్రశాంతి, కెంచె లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, భాషమ్మ, షేక్ ఫహమిదా పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సబితారెడ్డి

అక్రమ కేసులు ఎత్తివేయండి

ఇబ్రహీంపట్నం: సీపీఐ నేతలపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ హరీశ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో సుమారు పదివేల మంది, చేవెళ్ల మండల పరిధిలో సుమారు 800 మంది పేదలు ఇళ్ల స్థలాల కోసం గుడిసెలు వేసుకొని పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఈ రెండు చోట్ల భూ పోరాటంలో పాల్గొన్న సీపీఐ నేతలపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి, బెదిరింపులకు పాల్పడుతుండంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, పోలీసులు భూ కబ్జాదారులు కుమ్మక్కై భూదాన భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలపై, సీపీఐ నేతలపై అక్రమ, కుట్ర కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈటి నరసింహ, పాలమాకుల జంగయ్య, ఆందోజు రవీంద్రచారి, పానుగంటి పర్వతాలు, ముత్యాల యాదరెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



కలెక్టర్ హరీశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

విద్యా సమస్యలు పరిష్కరించాలి



ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేస్తున్న పోలీసులు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్

షాద్‌నగర్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్)జిల్లా అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు.స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నాయకులు,కళాశాల విద్యార్థులతో కలిసి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందన్నారు.స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సాంఘీక సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నా, నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పుస్తకాలు, స్టేషనరీ వస్తువులు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ప్రతి నియోజకవర్గంలో మహిళా డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటు బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేపట్టిన వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ చౌహాన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆకాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితమా?

అతిథి గృహానికి నోచుకోని ఆమనగల్లు


నక్సల్స్ పేల్చివేసిన అతిథిగృహం భవనం

ఆమనగల్లు: ఆమనగల్లులో అతిథిగృహం నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. పట్టణంలో అతిథిగృహం లేకపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఉన్న అటవీశాఖ అతిథిగృహాన్ని ఏళ్ల క్రితం నక్సల్స్ పేల్చివేసినప్పటికీ నేటికీ దానిని పునరుద్ధరించ లేదు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అతిథిగృహం నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలు అలాగే ఉన్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపకపోవడంతో అదికాస్త హామీలకే పరిమితమైంది. నాలుగు మండలాలకు కూడలిగా.. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ఆమనగల్లులో ఏ ఒక్క శాఖకు అతిథిగృహం లేదు. దీంతో మంత్రులు, ఉన్నత స్థాయి అధికారులు, ప్రముఖులు వచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవడానికి, భోజనం చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి, ప్రెస్‌మీట్లు నిర్వహించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తప్పనిసరి పరిస్థితులలో ఆమనగల్లు సమీపంలోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లులో ఉన్న అతిథి గృహాన్ని వినియోగించుకుంటున్నారు.

పునర్నిర్మాణానికి ప్రతిపాదనలు

పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న అతిథి గృహాన్ని దాదాపు ఇరవై ఐదేళ్ల క్రితం నక్సలైట్లు పేల్చివేశారు. దాని స్థానంలో నూతన అతిథిగృహం నిర్మాణానికి అటవీశాఖ ప్రతిపాదనలు చేసినప్పటికీ ప్రతిపాదనలకే పరిమితమైంది. నూతనంగా ఆర్‌అండ్‌బీశాఖ ఆధ్వర్యంలో అతిథి గృహం నిర్మించాలని ఆమనగల్లు మండల సమావేశంలో తీర్మానం చేశారు. అయినా ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉంది. అతిథిగృహం నిర్మాణానికి అనువైన స్థలాలు ఉన్నప్పటికీ నిర్మాణానికి ఎవరూ చొరవ చూపలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని అతిథిగృహం నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ఆమనగల్లులో అతిథిగృహం నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో అతిథిగృహం నిర్మించాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిల దృష్టికి తీసుకుపోయాం. అతిథిగృహం నిర్మాణానికి కృషి చేస్తున్నాం.

– అనిత, ఎంపీపీ, ఆమనగల్లు

కారు అదుపుతప్పి..

- జీహెచ్‌ఎంసీ ఉద్యోగికి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: అదుపుతప్పిన వేగంతో వచ్చిన బీఎండబ్ల్యూ కారు ఢీకొట్టడంతో జీహెచ్ఎంసీ ఉద్యోగికి తీవ్ర గాయాలయ్యాయి. బంజారాహిల్స్ వార్డు జీహెచ్‌ఎంసీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.బాలచందర్ యాదవ్ శుక్రవారం తెల్లవారుజామున బంజారాహిల్స్ రోడ్ నెం.13లో పారిశుద్ధ్య పనులను పరిశీలించేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదే సమయంలో రాంగ్ రూట్‌లో మితిమీరిన వేగంతో దూసుకు వచ్చిన బీఎండబ్ల్యూ కారు బాలచందర్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం బీఎండబ్ల్యూ కారు ఆగకుండా ముందుకు దూసుకువెళ్లింది. ఈ మేరకు స్థానికులు బంజారాహిల్స్ పోలీసులకు సమాచారం ఇవ్వగా 108 అంబులెన్స్ సాయంతో సెంచురీ ఆస్పత్రిలో చేర్చారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీ ఆధారంగా కారు ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసిన పోలీసులు కారు నడిపిస్తున్న వారు ఎవరనే విషయంపై ఆరా తీస్తున్నారు. కారు ప్రస్తుతం మాదాపూర్‌కు చెందిన నిర్మాణ సంస్థ పేరుతో ఉందని, ఇటీవల షాహబాజ్ అనే వ్యక్తి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కారును తన పేరు మీదకు మార్చుకోలేదని తేలింది. ప్రమాద సమయంలో సాహిల్ అనే యువకుడు కారు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ సమయంలో కారులో ఇద్దరు యువతులతో పాటు మరో ముగ్గురు యువకులు ఉన్నట్లు తేలింది.

మరో యువకుడి మృతదేహం వెలికితీత


అంజద్ (ఫైల్)

పహాడీషరీఫ్: మద్యం మత్తులో జల్‌పల్లి చెరువులో దూకి మృతి చెందిన మరో యువకుడి మృతదేహాన్ని పహాడీషరీఫ్ పోలీసులు శుక్రవారం వెలికితీశారు. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అహ్మద్‌ఖాన్ అతని స్నేహితులు సయ్యద్ సైఫ్ హుస్సేన్ గౌస్ ఖాన్, షైరా, మోజియా, హైదర్, అంజద్ మద్యం తాగేందుకు గురువారం కట్టమైసమ్మ ఆలయ ప్రాంతానికి వచ్చారు. మద్యం మత్తులో హుస్సేన్, గౌస్ ఖాన్, మోజియా జల్‌పల్లి చెరువులో దూకారు. స్థానికుల సాయంతో షైరా బయటపడ్డాడు. హైదర్, అంజద్ నీట మునిగారు. అయితే హైదర్ మృతదేహాన్ని గురువారం రాత్రి వెలికితీశారు. అంజద్ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.





గందరగోళం

ఫలక్‌నుమా రైలు దగ్ధం ఘటనతో ఆందోళన

- సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రయాణికుల పడిగాపులు
- సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ద.మ.రైల్వే

సాక్షి, సిటీబ్యూరో: ఘట్‌కేసర్ సమీపంలోని పగిడిపల్లి వద్ద శుక్రవారం జరిగిన ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ప్రమాద ఘటన ప్రయాణికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రయాణికులంతా క్షేమంగా బయటపడినప్పటికీ.. కళ్ల ముందే అగ్నికీలలు వ్యాపించడంతో భయాందోళనతో పరుగులు తీశారు. దగ్ధమైన బోగీలను వదిలేసి మిగతా బోగీలలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకొంది. కొందరు ప్రయాణికులు మాత్రం పగిడిపల్లి నుంచే బస్సులు, ఇతర వాహనాల్లో నగరానికి చేరుకున్నారు. ప్రయాణికులంతా ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ వచ్చారు. చాలామంది ప్రమాదం నుంచి తేరుకోలేకపోయారు. పగటిపూట కావడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, రాత్రి వేళలో ప్రమాదం జరిగి ఉంటే ఇలా ప్రాణాలతో బయటకు వచ్చే వాళ్లం కాదని కొందరు ప్రయాణికులు తెలిపారు. పైగా మంటలు అంటుకోవడంతో పాటే ట్రైన్ నిలిచిపోవడం వల్ల బయటపడగలిగినట్లు చెప్పారు. వందల కిలోమీటర్లు దాటుకొని వచ్చిన హౌరా– ఫలక్‌నుమా (12703) ఎక్స్‌ప్రెస్ మరికొద్ది సేపట్లో ప్రయాణికులు గమ్యం చేరుకొంటారనగా ప్రమాదానికి గురికావడం గమనార్హం.ఈ రైలు ప్రమాదంతో తమకు ఒడిశా ఘటనే గుర్తుకు వచ్చిందని, తలుచుకొంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోందని కొందరు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వివిధ మార్గాల్లో నగరానికి బయలుదేరిన ప్రయాణికులకు దక్షిణమధ్య రైల్వే అన్ని ఏర్పాట్లు చేసింది.



పలు మార్గాల్లో రైళ్లు రద్దు..



- ఫలక్‌నుమా ప్రమాద ఘటన నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి శుక్రవారం బయలుదేరాల్సిన పలు రైళ్లు రద్దయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే రైళ్లను పాక్షికంగా రద్దు చేశారు. కొన్నింటిని ఇతర రూట్‌లలోకి మళ్లించారు.దీంతో ప్రయాణికులు గందరగోళానికి గురయ్యారు. ఆకస్మికంగా రైళ్లు రద్దు కావడంతో టిక్కెట్ రీఫండ్ కోసం బారులు తీరారు. మరోవైపు ఏ ట్రైన్ వస్తుందో, ఏది రద్దయిందో తెలియకపోవడంతో ఆందోళన నెలకొంది.
- సికింద్రాబాద్– రేపల్లె (17645), సికింద్రాబాద్–మన్మాడ్ (17064) ఎక్స్‌ప్రెస్ రైళ్లను అధికారులు పూర్తిగా రద్దు చేశారు. శుక్రవారం సాయంత్రం 6.40 కి బయలుదేరవలసిన సికింద్రాబాద్–తిరుపతి (12764) ఎక్స్‌ప్రెస్ రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 8.40 గంటలకు బయలుదేరింది. తిరువనంతపురం– సికింద్రాబాద్ (17229)ఎక్స్‌ప్రెస్ రామన్నపేట్–సికింద్రాబాద్ మధ్య రద్దయింది.
- రేపల్లె–సికింద్రాబాద్ (17646) ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను నడికుడి–సికింద్రాబాద్ మధ్య రద్దు చేశారు.అలాగే సికింద్రాబాద్–తిరువనంతపురం (17230),సికింద్రాబాద్–హౌరా (12704) రైళ్లను కాజీపేట్,విజయవాడ మీదుగా మళ్లించారు.విశాఖపట్నం–లింగంపల్లి (12805),నర్సాపూర్–నాగర్‌సోల్ (17231)రైళ్లను విజయవాడ, కాజీపేట్ మీదుగా మళ్లించారు.

సహాయ కేంద్రం..

సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రద్దయిన రైళ్లతో పాటు, వివిధ మార్గాల్లో రాకపోకలు సాగించే రైళ్ల సమాచారం కోసం ప్రత్యేకంగా సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు రైళ్ల సమాచారాన్ని అందజేయడంతో పాటు అన్ని విధాలా సహాయ సహకారాలను అందజేశారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. సాయంత్రం 5.55 గంటల వరకు ఆ సెక్షన్‌లో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.

మహంకాళి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి జాతరలో అమ్మవారిని సులభంగా దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఈ నెల 9, 10వ తేదీల్లో జరగనున్న మహంకాళి అమ్మవారి జాతర సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఉత్తర మండలం డీసీపీ చందనాదీప్తితో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి శుక్రవారం ఆయన దేవాలయ పరిసరాల్లో పర్యటించారు. బోనాలతో వచ్చే భక్తులు నేరుగా అమ్మవారి దర్శనానికి వెళ్లేలా ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. పోలీసులు జాతర ప్రశాంతంగా సాగేలా పర్యవేక్షించాలన్నారు. ఆలయం చుట్టు పక్కల వీధి దీపాలు వెలిగేలా జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, ఆర్డీఓ వసంతకుమారి, ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డె, ఏసీపీ రమేష్, ఎండోమెంట్ డీసీ రామకృష్ణ, ఆలయ ఈఓ మనోహర్‌రెడ్డి, జలమండలి డైరెక్టర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

పోచారం: అనారోగ్యం కారణంగా రైల్వే ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పోచారం మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్‌లోని ఈడబ్ల్యూఎస్ కాలనీకి చెందిన జి.రాజేందర్ (37) ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ పరిధిలో గ్యాంగ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న అతను జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం యమ్నంపేట్‌లోని రైల్వే ట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి, మరో నలుగురికి గాయాలు
- ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో ఘటన
- మృతులు యాచారం వాసులు


వెంకటయ్య (ఫైల్)


రజిత


పలాస సమీపంలో ప్రమాదానికి గురైన కారు

యాచారం: దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా.. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం ఏపీలోని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రామకృష్ణాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. యాచారం మండలం నందివనపర్తికి చెందిన కొండూరి వెంకటయ్య (65), విజయలక్ష్మి దంపతులు నగరంలో నివాసం ఉంటున్న తమ సమీప బంధువులు సముద్రాల కృష్ణ, సముద్రాల పద్మ, గౌరిశెట్టి రజిత(59), డ్రైవర్ జానయ్యలతో కలసి ఐదురోజుల క్రితం కారులో తీర్థయాత్రలకు బయలుదేరారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రంలోని పూరి జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. తిరుగు పయనంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రామకృష్ణాపురం జాతీయ రహదారిపై వీరు ప్రయాణిస్తున్న కారు కల్వర్టును ఢీకొట్టింది. దీంతో గౌరిశెట్టి రజిత అక్కడికక్కడే మృతి చెందగా..వెంకటయ్య సమీప ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలొదిలాడు. మిగిలిన వారిని అక్కడి పోలీసులు శ్రీకాకుళం ఆస్పత్రిలో చేర్పించారు. నందివనపర్తి గ్రామానికి చెందిన కొండూరి వెంకటయ్య మంచి వ్యాపారస్తుడుగా గుర్తింపు పొందారు.

'మధ్యాహ్న భోజన' కార్మికుల సమ్మె నోటీసు


ఇబ్రహీంపట్నంలోని విద్యాధికారికి సమ్మె నోటీసు ఇస్తున్న సీఐటీయూ నేతలు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం విద్యావనరుల అధికారికి శుక్రవారం సీఐటీయూ నేతలు అందజేశారు. ఆ సంఘం పట్టణ కన్వీనర్ సీహెచ్ ఎల్లేష్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ కులాలకు చెందిన పిల్లలకు విద్యను అందించి వారిని చైతన్యం చేసేందుకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. అయితే భోజనం వండే కార్మికులకు కేవలం వెయ్యి రూపాయల వేతనం ఇస్తున్నారని, దీంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. భోజన బిల్లులు కూడా సక్రమంగా చెల్లించడంలేదని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా చెల్లించడంలేదని పేర్కొన్నారు. కార్మికులకు నెలకు రెండు వేల వేతనం పెంచుతున్నట్లు ప్రభుత్వం 2022 మార్చి బడ్జెట్‌లో ప్రకటించినా ఇప్పటికి అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఈనెల 10, 11, 12 తేదీల్లో స్కూల్లో వంట బంద్ పెట్టి సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బుగ్గరాములు, పోచమోని కృష్ణ, మధ్యాహ్న భోజన కార్మికులు పుష్పమ్మ, సుగుణమ్మలు పాల్గొన్నారు.

నకిలీ ఎన్‌ఓసీలతో బ్యాంకులకు టోకరా

- వాహనాలపై రుణం తీసుకుని రూ. 1.26 కోట్లు ఎగవేత
- ఐదుగురిపై కేసు నమోదు
- ప్రధాన నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

హయత్‌నగర్: నకిలీ ఎన్‌ఓసీలు సృష్టించి బ్యాంకుల్లో వాటిని తనఖా పెట్టిన వాహనాలను విడిపించుకుని దాదాపు రూ. 1.26 కోట్లు ఎగవేసిన ముఠా గుట్టును పోలీసులు బట్టబయలు చేశారు. ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఏపీ లోని విశాఖపట్నం అల్లిపురానికి చెందిన వీరవెంకట సత్యగుప్త నాగరాజు నగరానికి వలస వచ్చి తిరుమలగిరిలో వర్ధన్ పేరుతో ప్యాకింగ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేశాడు. వాహనాలపై రుణం తీసుకుని బ్యాంకులను మోసం చేయాలనే ఉద్దేశంతో అతను 2018లో సికింద్రాబాద్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 19 లక్షలు లోన్ తీసుకుని మహింద్రా షోరూంలో కారు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఓ వ్యక్తి బ్యాంకు రుణం చెల్లించి తీసుకున్న ఎన్‌ఓసీ సర్టిఫికెట్ ఫోటో తీసుకున్న అతను దాని ఆధారంగా నకిలీ ఎన్‌ఓసీ పత్రాన్ని సృష్టించాడు. సదరు సర్టిఫికెట్‌ను ఆర్‌టీఏ కార్యాలయంలో చూపించి కారును తనఖా నుంచి విడిపించుకుని తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. అనంతరం దానిని పరిచయస్తులకు విక్రయించి వారి పేరుతో యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకులలో రుణాలు తీసుకుని నకిలీ ఎన్‌ఓసీలతో పేర్లు మార్చి అదే కారును ఆంధ్రాకు తరలించి అక్కడ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఇలా మరో కారుపై ఉప్పల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ. 22 లక్షలు రుణం తీసుకున్నాడు. తన స్నేహితురాలి భర్త రవికుమార్ ఆధార్‌కార్డును మార్చి నాగభూషణం పేరుతో ఆధార్ కార్డు సృష్టించి అతని పేరుతో బొలేరో వాహనం కొనుగోలు చేసి హయత్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సి బ్యాంకులో రూ. 10. లక్షల లోన్ తీసుకున్నాడు. ఇదే తరహాలో మరో మూడు ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేశాడు. ఇలా బ్యాంకులను మోసం చేసి తీసుకున్న వాహనాలను ఏపీకి తరలించి నెంబర్లు మార్చి విక్రయించేవాడు. బ్యాంక్ అధికారుల ఫిర్యాదుతో అతడిపై హయత్‌నగర్, వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు కావడంతో దర్యాప్తు చేపట్టిన మల్కాజ్‌గిరి ఎస్‌ఓటీ, హయత్‌నగర్ పోలీసులు నిందితుడు నాగరాజును అరెస్ట్ చేశారు. అతడికి సహకరించిన శ్రావణి, నాగభూషణం, సంతోష్‌కుమార్, లక్ష్మీకాంత్‌లపై కేసు నమోదు చేసిన పోలీసులు వారి నుంచి 5 కార్లు, ఒక బైక్, ల్యాప్‌టాప్, నకిలీ స్టాంపులు, స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో సీఐ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.